
సాక్షి
హనుమకొండ

బుధవారం | 9 | ఏప్రిల్ | 2025



నిఘా నీడలో మూల్యాంకనం
టెన్త్ విద్యార్థుల పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం అధికారులు సీసీ కెమెరాల నిఘాలో పర్యవేక్షిస్తున్నారు. - 8లో



సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రణాళికలు
పట్టణ ప్రాంతాల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి సరిపడా స్థలాలు లేవని, ఇండోర్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలని టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు. - 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
$38^{0}/25^{0}$

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

20నుంచి 'ఓపెన్' పరీక్షలు
విద్యారణ్యపురి : జిల్లా వ్యాప్తంగా ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలు ఈనెల 20నుంచి 26వ తేదీవరకు జరగనున్నాయి. ఈ మేరకు పరీక్షలపై మంగళవారం డీఆర్‌ఓ గణేశ్.. డీఈఓ వాసంతి, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అనగోని సదానందం పాటు వివిధ శాఖల అధికారులు, డీఐఈఓ తదితరులతో సమీక్షించారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2:30నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు రెండు విడతల్లో జరుగుతాయని కోఆర్డినేటర్ పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం
కాజీపేట అర్బన్ : హనుమకొండ జిల్లాలోని బీసీ, ఈబీసీ విద్యార్థుల నుంచి మహాత్మా జ్యోతిరావు పూలే విదేశీ విద్యానిధి బీసీ ఓవర్సీస్ పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ వెల్ఫేర్ డీడీ రామ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీలోపు www.telanganaepass.cgg.gov.inవెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక




వరంగల్ స్పోర్ట్స్ : సికింద్రాబాద్‌లోని లాలాపేట మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 11, 12 తేదీల్లో జరిగే అండర్-19 రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులను మంగళవారం ఎంపిక చేశారు. బి.నితిన్ 50 కేజీల కేటగిరీలో, ఎన్.రాజర్షి 80 కేజీలు, జి.భరత్ 65 కేజీల విభాగాల్లో ఎంపికైనట్లు కార్యదర్శి పోతరాజు రాజేందర్ తెలిపారు.

'కైటెక్స్'లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ షురూ..
గీసుకొండ: వరంగల్ జిల్లాలోని గీసుకొండ-సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ)లో కేరళకు చెందిన చిన్న పిల్లల దుస్తుల తయారీ కైటెక్స్ కంపెనీ నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. ఈ మేరకు 25,500 ఉద్యోగాలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ ఇంజనీర్లు, మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్లు, ఇన్‌చార్జ్‌లు తదితర విభాగాల్లోని ఉద్యోగాలను భర్తీచేయనుంది. రెండు రోజుల నుంచి పలువురు నిరుద్యోగులు కంపెనీ వద్దకు వచ్చి తమ బయోడేటాలు అధికారులకు సమర్పిస్తున్నారు.

నేటినుంచి ఎస్‌ఏ-2 పరీక్షలు
విద్యారణ్యపురి : ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నేటి (బుధవారం)నుంచి అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంటు (ఎస్‌ఏ-2) పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలను టైంటేబుల్ ప్రకారం నిర్వహించాలని ఆయా డీఈఓలు హెచ్‌ఎంలను ఆదేశించారు. ఈనెల 9నుంచి 17వ తేదీ వరకు ఎస్‌ఏ-2 పరీక్షలు కొనసాగుతాయి. ఫలితాలను 23న ప్రకటించి విద్యార్థులకు క్యూమిలేటివ్ రికార్డులు అందజేయాల్సి ఉంటుంది. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ఎస్‌ఏ-2 పరీక్షల అన్ని సబ్జెక్టుల ప్రశ్నపత్రాలను డీసీఈబీ కార్యాలయంనుంచి ఎంఈఓలకు పంపారు. అక్కడినుంచి అన్ని యాజమాన్యాల పాఠశాలల హెచ్‌ఎంలు తీసుకెళ్లారు. ఎంఈఓలు, జిల్లా నోడల్ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు రోజూ పాఠశాలలను తనిఖీ చేయాలని డీఈఓ వాసంతి, డీసీఈబీ కార్యదరి బి.రాంధన్ ఆదేశించారు.

లేఔట్ స్కీం..



ఎల్‌ఆర్‌ఎస్-2015 దరఖాస్తుల పరిష్కారంలో 'కుడా' జాప్యం
- ప్రభుత్వం ఆదేశించినా పట్టించుకోని అధికారులు
- పదేళ్లుగా మూడువేల మంది అర్జీదారుల ఇబ్బందులు
- ఉన్నతాధికారులు దృష్టి సారిస్తేనే సమస్య కొలిక్కి

సాక్షి, వరంగల్:

లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్)-2015 దరఖాస్తుదారులు రూ.10 వేల ఫీజు చెల్లించినా అవి క్లియర్ కాక నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది. 2020 అక్టోబర్ 12న ఇచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ ఉత్తర్వుల్లో కూడా 2015 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై ప్రభుత్వం స్పష్టమైనా ఆదేశాలిచ్చినా ఆచరణలో మాత్రం ఎక్కడా క్లియర్ అయినట్లుగా కనిపించడం లేదు. పరిష్కరిస్తే రూ.కోట్లలో ఆదాయం వచ్చే అవకాశమున్నా ఆవైపుగా కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు న్నాయి. 2015లో మాన్యువల్‌గా 'కుడా'కు కట్టిన చలాన్లు, దరఖాస్తుదారులు కూడా హనుమకొండలోని 'కుడా' కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరగాల్సిన పరిస్థితి ఉంది.'కుడా'లో 2015కు సంబంధించిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు మూడువేల వరకు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. క్లియర్ చేస్తే రూ.10 వేలు పోగా మిగిలిన నగదు చెల్లిస్తామని లిఖితపూర్వకంగా 'కుడా' అధికారులకు ఇస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.


రూ.లక్షల భారం..

ఇల్లు నిర్మించుకునేందుకు కొంతమంది అనుమతి కోసం వెళ్తే ప్రస్తుతమున్న మార్కెట్ విలువ ప్రకారం బల్దియా అధికారులు లెక్కలు వేస్తుండడంతో రూ.లక్షల్లో ఫీజు కట్టాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఇందులో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు 14 శాతంతోపాటు కాంపౌండ్ ఫీజు 33 శాతం వసూలు చేస్తుండడం గమనార్హం. అదే 2020లో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నవారికి మాత్రం ఇన్నాళ్లు ఇంటి నిర్మాణ సమయంలో సదరు రిసిప్ట్ (రూ.వెయ్యి చెల్లించింది) బల్దియా అధికారులకు ఇస్తున్నారు. దీంతో అప్పటి సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ ప్రకారం ఫీజు విధిస్తుండడంతో వారికి కాస్త ఊరట లభిస్తోంది. అదేవిధానాన్ని 2015 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు, అది కూడా రూ.10 వేలు చెల్లించిన వారికి అధికారులు ఇవ్వకపోవడంతో రూ.లక్షల్లో ఫీజుకు భయపడుతున్నారు. '2015 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు క్లియర్ చేయమంటూ దరఖాస్తులు ఇస్తే క్లియర్ చేస్తున్నాం. సంబంధిత పత్రాలు జతచేస్తే పరిశీలించి ఫైనల్ ప్రొసీడింగ్స్ ఇస్తున్నాం' అని 'కుడా' అధికారి ఒకరు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఆచరణకు నోచుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

ఏం చేయాలంటే...

'కుడా' ఎల్‌ఆర్‌ఎస్ వరంగల్ పేరుతో హనుమకొండలోని యాక్సిస్ బ్యాంకులో ఓపెన్ చేసిన అకౌంట్‌కే 2015 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులతో రూ.పది వేల ఫీజు కట్టించారు. ఆ బ్యాంకులో వివరాలు అధికారులు సేకరించి అప్పుడు ఇచ్చిన కాంటాక్ట్ నంబర్‌ను సంప్రదించాలి. మీరు రూ.పది వేల ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు 2015లో కట్టారు. ఇప్పటికి క్లియర్ చేసుకునే అవకాశముందంటూ దరఖాస్తుదారులను సంప్రదిస్తే చాలా క్లియర్ అవుతాయి.
- ఇప్పటికే తమకు ఎల్‌ఆర్‌ఎస్ ఫైనల్ ప్రొసీడింగ్స్ ఇవ్వాలని, ఫీజు చెల్లిస్తామంటూ చాలామంది లిఖితపూర్వకంగా 'కుడా'కు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇవి కూడా క్లియర్ చేయాలి.
- 2020 ఎల్‌ఆర్‌ఎస్ (రూ.వెయ్యి) ఫీజు కట్టినవారికి ఇంటి నిర్మాణ అనుమతి సమయంలో అప్పటి సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ ప్రకారం అనుమతి ఇస్తున్నారు. ఇది 2015 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు కూడా కల్పించాలి.

హంటర్‌రోడ్డులోని నందిహిల్స్ రోడ్డు నంబర్-5లో వి.సౌందర్య 2009 సంవత్సరంలో 308.33 గజాల స్థలం కొనుగోలు చేశారు. ఈ స్థలం క్రమబద్ధీకరణ కోసం 2015లో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకుని రూ.10 వేల ఫీజు కూడా చెల్లించారు. ప్లాట్‌కు సంబంధించిన పత్రాలు జతచేసి ఎల్‌ఆర్‌ఎస్ ఫైనల్ ప్రొసీడింగ్స్ ఇవ్వాలని, రూ.10 వేలు పోగా మిగిలిన నగదు చెల్లిస్తానంటూ పలుమార్లు లిఖితపూర్వకంగా 'కుడా' కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నా కదలిక లేదు. ఇంటి నిర్మాణ అనుమతి కోసం బల్దియాకు వెళ్తే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు ఇప్పుడున్నా మార్కెట్ విలువ ప్రకారం రూ.నాలుగు లక్షలపైగా వస్తుందని సమాధానమిచ్చారు. 2015 ఎల్‌ఆర్‌ఎస్ 'కుడా' క్లియర్ చేస్తే అప్పటి మార్కెట్ విలువ సేల్ డీడ్ ప్రకారం రూ.60 నుంచి రూ.70 వేలు అవుతుంది. దీంతో ఆమె ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడింగ్స్ కోసం ప్రదక్షిణ చేస్తున్నారు.



ఎల్‌ఆర్‌ఎస్ ఫీ రిసిప్ట్

1నుంచి సమ్మర్ కోచింగ్ క్యాంపులు



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఇతర అధికారులు

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్ : మే 1నుంచి జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, విజయవంతం చేసేందుకు సహకరించాలని కలెక్టర్ ప్రావీణ్య పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మే 1నుంచి 31వరకు పలు రకాల క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 9 (బుధవారం) నుంచి 25వ తేదీవరకు తమ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. శిక్షణకు వచ్చే వారి సంఖ్య ప్రతి ఏటా పెరుగుతోందని, అందుకు తగ్గట్లుగా అధికారులు ఏర్పాట్లు చేయాలని కోరారు. దాతల సహకారంతో శిబిరాల వద్ద క్రీడాకారులకు పండ్లు, పాలు, అల్పాహారం వంటివి అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మొత్తం 22 అంశాల్లో శిక్షణ ఇస్తున్నామని, ఎక్కువ మంది సద్వినియోగం చేసుకునే విధంగా క్రీడా సంఘాలు కృషి చేయాలన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అజీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. క్రీడల అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. జిల్లా క్రీడలు, యువజన శాఖ అధికారి గుగులోత్ అశోక్ మాట్లాడుతూ క్రీడా శిబిరంలో 4వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని వివరించారు. అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్ బాల్, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్ బాల్, రెజ్లింగ్, కబడ్డీ, క్రికెట్, లాన్‌టెన్నిస్, సాఫ్ట్‌బాల్, హాకీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్ తదితర క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 25వ తేదీలోగా హనుమకొండ జేఎన్ఎస్‌లోని కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ వైవీ గణేశ్, డీఈఓ వాసంతి, సీఎంహెచ్‌ఓ రాజారెడ్డి, క్రీడా అసోసియేషన్ల ప్రతినిధులు శ్యామల పవన్‌కుమార్, మహ్మద్ కరీం, పింగిళి రమేశ్ రెడ్డి, తోట శ్యాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఉచితం

హసన్‌పర్తి : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక, మొరం అందజేస్తామని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇంటి నిర్మాణాలు చేపట్టాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. ఇందిరమ్మ పైలెట్ ప్రాజెక్ట్ కింద పెంబర్తి గ్రామంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. మండల పరిధిలో ఉంటే తహసీల్దార్, పక్క మండలంలో ఉంటే ఆర్డీఓ ద్వారా ఇసుక కూపన్లు అందజేస్తామన్నారు. అనంతరం గ్రామంలోని రేషన్‌షాపును కలెక్టర్ తనిఖీ చేసి, సన్న బియ్యం పంపిణీ తీరును పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చల్లా ప్రసాద్, ఎంపీడీఓ కర్ణాకర్ రెడ్డి, హౌజింగ్ పీడీ రవీందర్ నాయక్, డీఈఈ సిద్ధార్థ నాయక్, గ్రామ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, హౌజింగ్ ఏఈ నరేందర్ రాజ్, మాజీ సర్పంచ్ పూల, కారోబార్ సదానందం పాల్గొన్నారు.

ఆసరా మార్ట్ ప్రారంభం

హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లో మహిళా సంఘం సభ్యుల కోసం ఏర్పాటుచేసిన ఆసరా మార్ట్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఓమిని మార్ట్ కేంద్ర ప్రభుత్వ ఆర్గనైజ్ సంస్థ సహకారంతో దీనిని ఏర్పాటు చేశారు. మహిళలు మార్ట్‌ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ మేన శ్రీను, జీఎం ఇండస్ట్రీస్ నవీన్‌కుమార్, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారి బాలరాజు, డీడబ్ల్యూఓ జయంతి, ఓమిని మార్ట్ ఎండీ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



కాకతీయ మెడికల్ కళాశాల 61వ గ్రాడ్యుయేషన్ డే మంగళవారం రాత్రి కాలేజీ మైదానంలో కనుల పండువగా నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో బంధుమిత్రులు రావడంతో కళాశాల ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది. మొత్తం 230 మంది విద్యార్థులు పట్టాలందుకున్నారు. ముఖ్యఅతిథిగా ఆరోగ్యవర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి హాజరయ్యారు. - ఎంజీఎం - 8లో

రీల్స్ ఆపి రియల్ లైఫ్‌లోకి రావాలి
- కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయాలి
- కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రణవ్



కాంగ్రెస్‌లో చేరిన వారితో ప్రణవ్

కమలాపూర్ : స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి రీల్స్ ఆపి రియల్ లైఫ్‌లోకి రావాలని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రణవ్ సూచించారు. మండలంలోని ఉప్పల్‌లో మంగళవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ రాష్ట్రీయ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ నాయకులు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తే, బీజేపీ గాంధీజీ ఆశయాలను తుంగలో తొక్కి, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానపరస్తోందన్నారు. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ప్రణవ్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి రీల్స్ చేయడంపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదని విమర్శించారు. నియోజక వర్గానికి సుమారు 200కు పైగా కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరై నెలలు దాటినా ఇప్పటివరకు లబ్ధిదారులకు పంపిణీ చేయలేదన్నారు. సరిగ్గా చెక్కులకు గడువు తీరే ముందు రోజు వాటిని పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ ఝాన్సీరవీందర్, వైస్ చైర్మన్ దేశిని ఐలయ్యగౌడ్, నాయకులు రమేశ్, చరణ్ పటేల్, నారాయణరెడ్డి, భిక్షపతి, మహేష్, రమేశ్, గణేష్ పాల్గొన్నారు.

నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలి
- జెడ్పీ సీఈఓ విద్యాలత



నర్సరీని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత

ఎల్కతుర్తి : వేసవిలో నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా ఉదయం, సాయంత్రం సమయాల్లో మొక్కలకు సరిపడా నీరు అందించాలని జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) విద్యాలత అధికారులకు ఆదేశించారు. మంగళవారం భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి, భీమదేవరపల్లి గ్రామాల్లోని నర్సరీలను ఆమె పరిశీలించారు. నర్సరీలకు అవసరమైన షేడ్ నెట్‌లు, నీటి సదుపాయం కల్పించాలని తెలిపారు. గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అత్యవసరమైతే గ్రామాల్లో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆమెవెంట ఎంపీడీఓ వీరేశం, పంచాయతీ కార్యదర్శి అనంత్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పౌరులెవరో.. అటెండర్లు ఎవరో?
- అటెండర్లు డ్రెస్ కోడ్ పాటించాల్సిందే
- మేయర్ గుండు సుధారాణి ఆదేశం

వరంగల్ అర్బన్ : బల్దియా ప్రధాన కార్యాలయానికి వస్తే పౌరులెవరో...అటెండర్లు ఎవరో అర్థం కాని పరిస్థితి ఉందని నగర మేయర్ గుండు సుధారాణి అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలో ఆమె ఆకస్మికంగా తనిఖీలు చేశారు. అటెండర్లు అందరూ డ్రెస్ కోడ్ పాటించాలని ఆదేశించారు. ఒక్కో చాంబర్‌కు ఇద్దరు, ముగ్గురు చొప్పున విధులు నిర్వహిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అంతర్గత బదిలీలు చేయాలన్నారు. పౌరసేవ కేంద్రంలో ఎల్‌ఆర్‌ఎస్, యువ వికాసం, తదితర ఫిర్యాదులు, వాటి నివృత్తి చేసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున క్యూలైన్‌లో నిల్చున్నారు. గమనించిన మేయర్ ఆ హెల్ప్‌డెస్క్ సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. అకౌంట్స్ సెక్షన్‌లో ఇటీవల కొంతమంది ఉద్యోగులు విధుల్లో చేరినందున వారికి శిక్షణ ఇప్పించి, సేవలను వినియోగించుకోవాలన్నారు. పబ్లిక్ హెల్త్, సీ 1 సెక్షన్, పింఛన్ సెక్షన్‌లను పరిశీలించారు. ఇన్‌వార్డ్, కంట్రోల్ రూమ్, జనన మరణ ధ్రువీకరణ విభాగాలను తనిఖీ చేసి జాబ్ నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ ఆవరణలో ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్ పట్ల మేయర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. క్యాంటీన్ వైపు మాత్రమే పార్కింగ్ చేయాలన్నారు.

పరిశ్రమల స్థాపనతోనే ఆర్థిక ప్రగతి
- వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్ : పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతి సాధ్యమని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ (డీఐపీసీ) సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో టీజీఐపాస్ కింద వివిధ శాఖలకు సంబంధించి పరిశ్రమలు నెలకొల్పేందుకు 1,365 యూనిట్ల మంజూరుకు ప్రతిపాదనలు చేయగా.. 1,076 దరఖాస్తులకు అనుమతి మంజూరు చేసినట్లు తెలిపారు. 180 ప్రతిపాదనలు అసంపూర్తిగా ఉన్నందున తిరస్కరించామని, పూర్తి సమాచారంతో తిరిగి సమర్పించాలని కోరినట్లు పేర్కొన్నారు. సమావేశంలో పరిశ్రమలశాఖ జీఎం రమేశ్, లీడ్ బ్యాంకు మేనేజర్, జిల్లా రవాణా శాఖ అధికారి శోభన్ బాబు, అధికారులు పాల్గొన్నారు.

ఈ నెల 4వ తేదీన వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రంలో ఐపీఎల్ టీ-20 మ్యాచ్‌ల బెట్టింగ్ క్యాంపుపై టాస్క్‌ఫోర్స్ మెరుపుదాడి చేసింది. నలుగురు నిందితుల నుంచి రూ.10,500, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

ఈ నెల 5వ తేదీన కాజీపేటలోని వివిధ ప్రాంతాలకు చెందిన కొంతమంది ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి గోదాగు శ్రీనివాస్, గొడుగు రమేశ్, సముద్రాల శ్రీనివాస్, బోకరి సంతోశ్‌ను పట్టుకున్నారు. వీరి నుంచి రూ.20 వేల నగదుతో పాటు నాలుగు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఈ నెల 5న వరంగల్ కరీమాబాద్‌లోని ఓ ఇంటి ఆవరణలో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి కరీంనగర్‌కు చెందిన నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ.20వేల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఈ నెల 5న హనుమకొండ పీఎస్ పరిధిలో ఇటీవల పట్టుకున్న క్రికెట్ బెట్టింగ్ ఏజెంట్ హైదరాబాద్‌కు చెందిన చింతపండు కృష్ణ, మేడిశెట్టి నరేశ్‌తోపాటు ఆటగాళ్లు పులి ఓంకార్, పల్లపు సుకేశ్‌ను అరెస్ట్ చేసి వారినుంచి రూ. 1.58 లక్షలు రికవరీ చేశారు. క్రికెట్ బుకీ అయిన కాకినాడకు చెందిన గడ్డం వీరమణి కుమార్‌ను అదుపులోకి తీసుకుని రూ.1.50 లక్షల నగదు, 2 సెల్‌ఫోన్లు, స్వాధీనం చేసుకున్నారు.

బెట్టింగ్‌లపై ఉక్కుపాదం





వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జోరుగా 'ఐపీఎల్' జూదం
- ఈ సీజన్‌లో నాలుగు కేసులు నమోదు
- ముందే అప్రమత్తం చేసిన 'సాక్షి'
- వెలుగులోకి రాని ఎన్నో ఘటనలు
- ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బుకీ అరెస్ట్
- అతని అకౌంట్లలో భారీగా లావాదేవీలు

...వారం రోజుల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లపై పోలీసులు, టాస్క్‌ఫోర్స్ విసిరిన పంజా ఇది. ఐపీఎల్ సీజన్ మొదలైనప్పటినుంచి ముఖ్యంగా గ్రేటర్ వరంగల్ పరిధిలో బెట్టింగ్ జడలు విప్పింది.పోలీసులు సైతం బెట్టింగ్‌లను కట్టడి చేసేందుకు ముమ్మరంగా చర్యలు చేపట్టారు., ఇందుకోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న టెక్నాలజీని వినియోగించుకోవడంతో పాటు, టాస్క్‌ఫోర్స్, ఇతర ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగడంతో ఉక్కుపాదం మోపుతున్నారు. కానీ వెలుగులోకిరాని ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. దొరికిన బెట్టింగ్ రాయుళ్ల అకౌంట్లలో నగదు లావాదేవీల లెక్క తేల్చే పనిలో ఉన్నారు.

- వరంగల్ క్రైం

బెట్టింగ్‌లపై కఠినంగా వ్యవహరిస్తాం..



ఎవరైనా క్రికెట్, ఇతర బెట్టింగ్‌లకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠినంగా వ్యవహరిస్తాం. ఈ భూతాన్ని కట్టడి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. సులభంగా వచ్చే డబ్బు వల్ల మంచికంటే చెడు ఎక్కువ చేస్తుంది. దీని మోజులో పడి యువత తమ బంగారు భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దు. ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడినట్లుగా తెలిస్తే తక్షణమే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలి. వివరాలు గోప్యంగా ఉంచుతాం.

- సన్ ప్రీత్ సింగ్, వరంగల్ పోలీస్ కమిషనర్

ఈ సీజన్‌లో నాలుగు కేసులు..

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ సీజన్‌లో ఇప్పటివరకు బెట్టింగ్‌కు పాల్పడుతున్న నాలుగు కేసుల్లో తొమ్మిది మందిని అరెస్టు చేశారు. వీరి బ్యాంక్ ఖాతాల్లో సుమారు రూ.42,68,300 వరకు లావాదేవీలు జరిగినట్లుగా పోలీసులు గుర్తించారు. తొలిసారిగా క్రికెట్ బెట్టింగ్ బుకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడకు చెందిన వీరమణికుమార్‌ను అరెస్టు చేసి, అతని బ్యాంక్ ఖాతాల్లో సుమారు రూ.3.50 కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. వీటి లెక్క తేలాల్సి ఉందని పోలీసులు చెబుతున్నారు.

ముందే హెచ్చరించిన సాక్షి

ఐపీఎల్ సీజన్ ప్రారంభసమయంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొదలైన బెట్టింగ్ తీరుపై సాక్షి ప్రత్యేక కథనం ప్రచురించింది. యువత ఏ యాప్‌లను వాడుతున్నారు.. బెట్టింగ్ జరుగుతున్న తీరు, యువత నష్టపోతున్న వైనంపై సవివరంగా పేర్కొంది. దీంతో పోలీసులు సైతం అప్రమత్తమై బెట్టింగ్‌రాయుళ్లపై ఉక్కుపాదం మోపుతున్నారు.



'సాక్షి'లో ప్రచురితమైన కథనం

సులభంగా డబ్బు సంపాదించాలనే..

సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో కొంతమంది యువత క్రికెట్ బెట్టింగ్‌ను ఎంచుకుంటున్నారు. యాప్‌ల మోజులో పడిలో బంగారు భవిష్యత్‌ను అంధకారం చేసుకోవడమే కాకుండా అప్పుల పాలై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ప్రతి ఒక్కరికీ ఇంటర్‌నెట్ అందుబాటులోకి రావడంతోపాటు, సోషల్ మీడియా సైతం యువతకు మరింత చేరువ కావడంతో మోసపూరితమైన ప్రకటనలు, సందేశాలకు యువత ఆకర్షితులవుతున్నారు. ఇంటి సభ్యులకు తెలియకుండా వీటిలో పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా నష్టపోవడంతోపాటు యువత బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభాస్థలి పరిశీలన



బహిరంగ సభా స్థలాన్ని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

ఎల్కతుర్తి: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రం శివారు, చింతలపల్లి గ్రామ సమీపంలోని సుమారు 1200 ఎకరాల్లో ఈనెల 27న బీఆర్‌ఎస్ రజతోత్సవ భారీ బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం ఆ పార్టీ నేతలు, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి దాస్యం వినయ్‌భాస్కర్, ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు వేర్వేరుగా సభా స్థలాన్ని పరిశీలించారు. సభా స్థలి ప్రాంగణంలో అక్కడక్కడ కొంత వరిపంట కోతదశలో ఉన్నందున ఆ ప్రాంత్రాన్ని బీఆర్‌ఎస్ నేతలు పరిశీలించారు. మిగతా స్థల ప్రాంగణం పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. మరో వారం రోజుల్లో సభా స్థలం పనులు పూర్తి కానున్నాయని అంచనా వేశారు. నాయకులు పిట్టల మహేందర్, కదారి రాజు, తంగెడ నగేశ్, డుకిరె రాజేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

దూరవిద్య ఎమ్మెస్సీ సైకాలజీ పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య కేంద్రం ఎమ్మెస్సీ సైకాలజీ ఫైనలియర్ విద్యార్థులు, ఎక్స్ అభ్యర్థులకు థియరీ, ప్రాక్టికల్స్, డిప్లొమా ఇన్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ పరీక్షలు ఈనెల 24 నుంచి నిర్వహించాల్సిండగా ఆయా పరీక్షలు వాయిదావేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మళ్లీ ఆయా పరీక్షలు ఎప్పుడు నిర్వహించేది తర్వాత వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు.

యాంటీ బయాటిక్స్‌తో పశువులకు ముప్పు

- కేవీకే శాస్త్రవేత్త రాజన్న



మాట్లాడుతున్న కేవీకే కోఆర్డినేటర్ రాజన్న

మామునూరు: అధిక పాల దిగుబడి కోసం విచక్షణారహితంగా యాంటీ బయాటిక్స్ వినియోగిస్తే పశువులు, ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని మామునూరు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, కోఆర్డి నేటర్ రాజన్న అన్నారు. ఖిలా వరంగల్ మండలం మామునూరు పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వ విద్యాలయంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో కేవీకే, సద్గురు మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో 'యాంటీ మెక్రోబియల్ నిరోధకత- పరిష్కారాలు' అనే అంశంపై పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం డాక్టర్ వంశీకృష్ణ యాంటీ బయాటిక్స్ వినియోగం, వాటి మోతాదు, ఎక్కువ వాడితే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అంతకు ముందు పశువుల పాకల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, షెడ్లు నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన విషయాలపై డాక్టర్ అమృత్‌కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వరప్రసాద్, కైలాశ్, సాయికిరణ్, శాస్త్రవేత్తలు, పాడి రైతులు పాల్గొన్నారు

నిఘా నీడలో మూల్యాంకనం

- అనారోగ్య కారణాల సాకు చూపి రానివారిని పిలిపించి విధుల అప్పగింత
- జెన్యూన్‌గా ఉన్నవారికే మినహాయింపు
- సెల్‌ఫోన్లు వినియోగిస్తుండగా డీఈఓ గుర్తింపు
- స్పాట్ కేంద్రాన్ని సందర్శించిన రాష్ట్ర అబ్జర్వర్

సీసీ కెమెరాల పర్యవేక్షలో 'టెన్త్' వాల్యుయేషన్



విద్యారణ్యపురి: సంవత్సరం పొడవునా కష్టపడి చదివి పరీక్షలు రాసిన విద్యార్థుల భవితవ్యం ఉపాధ్యాయుల మూల్యాంకనం పైనే ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో వారు మూల్యాంకనం సక్రమంగా నిర్వహించేలా సంబంధిత అధికారులు సీసీ కెమెరాల నిఘా ద్వారా పర్యవేక్షిస్తున్నారు. హనుమకొండ జిల్లా కేంద్రంలో కాజీపేట ఫాతిమాహైస్కూల్ స్పాట్ కేంద్రంలో సీసీ కెమెరాల నిఘాలో టెన్త్ విద్యార్థుల పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం సోమవారం ప్రారంభమైన విషయం విధితమే. ఈస్పాట్ కేంద్రానికి అన్నిసబ్జెక్టులతోపాటు ఒకేషనల్ కోర్సులు జవాబుపత్రాలు కలిపి 2లక్షల 31వేలకుపైగా వచ్చాయి. సీఈలు, ఏఈలు, స్పెషల్ అసిస్టెంట్లు కలిపి 957మందిని ఆరు జిల్లాలు (ఉమ్మడి వరంగల్) హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల నుంచి నియమించగా అందులో తొలిరోజు 728 మంది విధుల్లో చేరారు. మరికొందరు అనారోగ్యకారణాలు చూపుతూ మెడికల్ రిసిప్ట్‌లతో తమకు స్పాట్‌నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ క్యాంప్ ఆఫీసర్, డీఈఓ వాసంతికి దరఖాస్తులు చేశారు. 140కి పైగానే ఇలా దరఖాస్తులు రాగావాటిని క్షుణ్ణంగా పరిశీలించి కొందరు సాకుతో దరఖాస్తులు చేసినట్లు గుర్తించారు. అలాంటి వివిధ సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్లను గుర్తించి ఫోన్లు చేసి మంగళవారం కేంద్రానికి పిలిపించారు. తప్పనిసరిగా మూల్యాంకనం చేయాల్సిందేనని డీఈఓ వాసంతి ఆదేశించారు. దీంతో ఇక చేసేదేమిలేక కొందరు ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. జెన్యూన్‌గా అనారోగ్య కారణాలు ఉన్న వారికి మినహాయింపు ఇచ్చారు. ఏయే సబ్జెక్టులలో తక్కువ ఉన్నారో వారి స్థానంలో అక్కడికి స్పాట్‌గా తమకు మూల్యాంకనం అవకాశం ఇవ్వాలని వచ్చిన ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకున్నారు. మరికొందరు మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను కూడా విధుల్లోకి తీసుకున్నారు. దీంతో మంగళవారం వరకు సరిపడా ఉపాధ్యాయులతో మూల్యాంకనం ప్రక్రియ కొనసాగింది. ఫాతిమా హైస్కూల్‌లో 24 గదుల్లో ఈ మూల్యాంకనం ప్రక్రియ కొనసాగుతోంది. ప్రతీ గదిలోనూ సీసీ కెమెరాల నిఘా ఉంది. డీఈఓ వాసంతి మంగళవారం ఆయా గదులను సందర్శించి పర్యవేక్షించారు. ఆ సమయంలో ముగ్గురు టీచర్లు సెల్‌ఫోన్లు వినియోగిస్తుండగా వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారని సమాచారం. బుధవారం నుంచి ఎవరైనా టీచర్లు సెల్‌ఫోన్‌లు వినియోగిస్తే వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు సమాచారం.

స్పాట్‌కేంద్రాన్ని సందర్శించిన రాష్ట్ర అబ్జర్వర్

ఫాతిమాహైస్కూల్‌లోని టెన్త్‌స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాన్ని రాష్ట్ర అబ్జర్వర్ విజయలక్ష్మీబాయి మంగళవారం సందర్శించారు. ఉపాధ్యాయులు మూల్యాంకనం చేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. వారికి కల్పిస్తున్న సదుపాయాలు ఎలా ఉన్నాయో కూడా పరిశీలించారు.

కబ్జా నిరూపిస్తే రాజీనామా చేస్తా

- పల్లా, తాటికొండలు క్షమాపణ చెప్పాలి
- ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పక్కన ఎమ్మెల్యే నాయిని

హన్మకొండ చౌరస్తా: తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎక్కడైనా ఒక్క గుంట భూమి కబ్జా చేసినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేవునూరు గుట్టల అటవీభూమిలో తాను రెండు వేల ఎకరాలని ఓసారి, 50 ఎకరాలు కబ్జా చేశానని మరోసారి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తాటికొండ రాజయ్యలు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. తాను కబ్జా చేసినట్లు సాక్ష్యాలు, ఆధారాలతో ప్రజల ముందుంచితే వారి ఇద్దరి ఇళ్లలో గులాం చేయడానికి సిద్ధమని, లేదంటే వారిద్దరు నా ఇంట్లో గులాంగా పని చేయాలని సవాల్ విసిరారు. ఆరోపణలు చేసిన నాయకులు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే న్యాయపరంగా చర్యలు వెనుకాడేది లేదని హెచ్చరించారు. వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, ఈవీ శ్రీనివాసరావు, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల రామకృష్ణ, బీసీ సెల్ జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అజీజ్‌ఖాన్, పల్లకొండ సతీశ్, నాయకులు పాల్గొన్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా..

- ముగ్గురు విద్యార్థులు, డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- కాచికల్ శివారులో ఘటన



ఘటనాస్థలిలో ఆటో

నెల్లికుదురు: విద్యార్థులను తీసుకెళ్తున్న ఓ ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం కాచికల్ శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఎర్రబెల్లిగూడెం గ్రామానికి చెందిన 14 మంది విద్యార్థులు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో చదువుకుంటున్నారు. గతంలో తొర్రూరు నుంచి నెక్కొండ వరకు వయా కాచికల్, ఎర్రబెల్లిగూడెం, మేచరాజుపల్లి, బూర్గుమళ్ల, కల్లెడ, పర్వతగిరి మీదుగా నడిచిన ఆర్టీసీ బస్సులు ప్రస్తుతం రద్దు అయ్యాయి. దీంతో ఆర్టీసీ బస్సులు లేని కారణంగా తల్లిదండ్రులు ప్రైవేట్ వాహనాల్లో తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం పాఠశాలకు ఆటోలో వెళ్లిన విద్యార్థులు మధ్యాహ్నం తిరిగి అదే ఆటోలో ఇంటికి వెళ్తున్నారు. ఆటో కాచికల్ శివారులోని ప్రధాన రహదారిపై అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులు ముద్రాల అక్షిత్, యాటగాని హర్షిత్, సాయి చరణ్‌తో పాటు ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. కాగా, ఆర్టీసీ బస్సులు పునరుద్ధరించి ఇలాంటి ప్రమాదాలను నివారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు బోల్తా..



బోల్తా పడిన డీలక్స్ ఏసీ బస్సు

- డ్రైవర్‌తో పాటు ఆరుగురికి గాయాలు
- తెల్లవారు జామున ఘటన

హసన్‌పర్తి: హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిపై చింతగట్టు క్యాంప్ ఓఆర్‌ఆర్ వద్ద ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌తోపాటు ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం..ఆదిలాబాద్ డిపోనకు చెందిన లహరి ఏసీ డీలక్స్ ఆర్టీసీ బస్సు సోమవారం సాయంత్రం ఒంగోలు నుంచి ఆదిలాబాద్‌కు బయల్దేరి, హనుమకొండ బస్‌స్టేషన్‌కు చేరుకుంది. ప్రయాణికులు ఎక్కిన అనంతరం మంగళవారం తెల్లవారు జామున 3:15గంటల ఆదిలాబాద్‌కు బయల్దేరింది. 3.30గంటలకు చింతగట్టు క్యాంప్ సమీపంలోకి రాగానే, అదే సమయంలో మోటార్ గ్రేడర్ వాహనం అజాగ్రత్తగా రోడ్డుపై రివర్స్‌గా వచ్చి బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సు బోల్తా పడింది. ఒక్కసారి భారీ శబ్దం రావడంతో బస్సునుంచి మంటలు వచ్చాయి. దీంతో ప్రయాణికులు ఆందోళనకు గురై అరుపులు చేయగా, వాహనదారులు, స్థానికులు అక్కడికి చేరుకుని వారిని బయటికి తీశారు.

ఏడుగురికి గాయాలు

ఈ ప్రమాదంలో బస్సు, డ్రైవర్ వైపు బోల్తా పడింది. దీంతో నిద్ర మత్తులో ఉన్న ప్రయాణికులు ఒకరిపై ఒకరు పడ్డారు. బస్సు డ్రైవర్ మారపల్లి సుభాష్‌చంద్రతో పాటు బత్తుల వెంకటేశ్, గంప శ్రీకాంత్, ఎండీ జాకీర్ హుస్సేన్, కోటేశ్వర్ రావు, ఎస్‌కే మోజీ, క్లెం రత్నంరాజు గాయపడ్డారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై శ్రీకాంత్ ఘటన స్థలాన్ని చేరుకున్నారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఎంజీఎంకు తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు. బస్సు బోల్తా పడడంతో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. వాహనాలు నిలిచిపోవడంతో సహాయక చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఘటనకు కారకుడైన మోటార్ గ్రేడర్ డ్రైవర్ వినోద్‌సింగ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

మంట వేడికి కోళ్లు మృత్యువాత

- రూ. 4. 50 లక్షల నష్టం
- ఆరెపల్లి శివారులోని పౌల్ట్రీ ఫామ్‌లో ఘటన



మృత్యువాత పడిన కోళ్లను పరిశీలిస్తున్న ఎస్సై పరమేశ్

శాయంపేట : మండలంలోని ఆరెపల్లి శివారులో మొక్కజొన్న సొప్ప కాలుతూ పౌల్ట్రీ ఫామ్ పక్కకు అంటుకోగా ఆ మంట వేడికి లక్షలాది రూపాయల విలువైన కోళ్లు మృత్యువాత పడ్డాయి. పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పరకాల రాజేందర్ ఆరెపల్లి గ్రామ శివారులో పౌల్ట్రీ ఫామ్ ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ ఫామ్ పక్కన గంగుల పులమ్మ వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిని శాయంపేటకు చెందిన దుంపల రాజిరెడ్డి కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశాడు. పంట కోసిన తర్వాత ఎండిన సొప్పను మంగళవారం తగులబెట్టగా కాలుతూ పౌల్ట్రీ ఫామ్ పక్కకు అంటుకుంది. మంట వేడికి సుమారు 1,500 కోళ్లు మృత్యువాత పడ్డాయి. వీటి విలువ రూ.4లక్షల 50వేలు ఉంటుంది. ఈ ఘటనపై రాజేందర్.. రాజిరెడ్డిని పెద్దమనుషుల ద్వారా అడిగించగా.. 'నా భూమిలో సొప్ప కాల్చుకున్నా.. మంట మీ దగ్గరకు వస్తే మీరే ఆర్పుకోవాలి.. నాకు సంబంధం లేదు' అని సమాధానం ఇచ్చాడు. ఈ విషయంపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. కాగా, రాజిరెడ్డికి తన చేనులోకి వెళ్లడానికి దారి లేదని, తాము కొన్నిసార్లు తమ పౌల్ట్రీ ఫామ్ నుంచి వెళ్లొద్దని చెప్పామని, దీంతో మనస్సులో పెట్టుకుని కావాలనే మక్క సొప్పను తగులబెట్టి కోళ్లు మృత్యువాత పడేలా చేశాడని రాజేందర్ ఆరోపించాడు.

ఉద్విగ్న క్షణాలు..





పట్టాలు అందుకుంటున్న వైద్య విద్యార్థులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ నందకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న వీసీ

యువ వైద్యులు సేవాభావంతో ముందుకు సాగాలి

- కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి
- కేఎంసీలో విద్యార్థులకు పట్టాల ప్రదానోత్సవం

ఎంజీఎం : ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని వైద్య వృత్తిలోకి ప్రవేశిస్తున్న యువ వైద్యులు వృత్తిని సేవాభావంతో కొనసాగిస్తూ పేదలకు బాసటగా నిలవాలని కాళోజీ హెల్త్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ నందకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి కాకతీయ మెడికల్ కళాశాల 61 గ్రాడ్యుయేషన్ డే కనుల పండువగా నిర్వహించారు. విద్యార్థుల పట్టాల ప్రదానోత్సవానికి తల్లిదండ్రులతోపాటుబంధుమిత్రులు పెద్ద ఎత్తున రావడంతో కళాశాల ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది. వైద్యవిద్యలో ఓ ఘట్టం పూర్తి చేసుకున్న విద్యార్థులు తమ బంధుమిత్రులతో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. 2019లో ఎంబీబీఎస్ అడ్మిషన్ పొందిన 230 మంది విద్యార్థులు ఈ సందర్భంగా పట్టాలు పొందారు.

సాంకేతిక పరిజ్ఞానంతో పరుగులు పెట్టాలి..

వైద్యవిద్యలో ఎంబీబీఎస్ మొదటి ఘట్టం మాత్రమేనని, వైద్యులు నిరంతర విద్యార్థులని వీసీ పేర్కొన్నారు. ఎంబీబీఎస్ అనంతరం తమ లక్ష్యాల మేరకు పోస్టు గ్రాడ్యుయేషన్ సాధించి ఉన్నత వైద్యులుగా ఎదగాలని ఆశించారు. ప్రస్తుతం వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పరుగులు పెడుతూ వైద్యవిద్యనభ్యసించాలని వర్సిటీ రిజిస్ట్రార్ సంధ్యాఅనిల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ రాంకుమార్ రెడ్డి, రాజేశ్వరి, విజయలక్ష్మి, మధుసూదన్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కేయూ దూరవిద్య ప్రాక్టికల్స్

కేయూ క్యాంపస్ : కేయూపరిధి లోని దూరవిద్య కేంద్రం అందిస్తున్న డిగ్రీ బీఎస్సీ, ఎంఎస్సీ సీఎస్ కోర్సుల మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ విద్యార్థులకు (2023-2024) ఈనెల 9,10,11 తేదీల్లో ప్రాక్టికల్స్ తరగతులు నిర్వహిస్తున్నామని దూర విద్యకేంద్రం డైరెక్టర్ సురేశ్‌లాల్, అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటగోపినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. కంప్యూటర్‌సైన్స్, గణితం, స్టాటిస్టిక్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు ఈనెల 12,13,14 తేదీల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా హాజరై ప్రాక్టికల్స్ పరీక్షలు రాయాలని కోరారు.

'యూత్ పార్లమెంట్'లో కేయూ విద్యార్థిని ప్రతిభ

- అభినందించిన వీసీ, రిజిస్ట్రార్



శ్రీజజాదవ్‌ను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

కేయూ క్యాంపస్ : ఢిల్లీలోని పార్లమెంట్‌లో ఈనెల 1నుంచి 3వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ యూత్ పార్లమెంట్ వన్ నేషన్, వన్ ఎలక్షన్‌పై కేయూ బయోటెక్నాలజీ ఫైనలియర్ విద్యార్థిని శ్రీజాజాదవ్ పాల్గొని అనర్గలంగా ప్రసంగించారు. 'ట్రాన్సిషనల్ మోడల్స్ ఇంప్లిమెంటేషన్ మార్గాలు' అనే అంశంపై ప్రసంగించి ప్రతిభ చాటారు. మంగళవారం శ్రీజాజాదవ్ కాకతీయ యూనివర్సిటీకి రాగా ఆమెకు విద్యార్థులు, కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాధిక, పలువురు అధ్యాపకులు మొదటిగేట్‌వద్ద స్వాగతం పలికి బయోటెక్నాలజీ విభాగం వరకు ర్యాలీ నిర్వహించారు. గజమాలతో సన్మానించారు. అనంతరం వీసీ కె. ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రం.. శ్రీజాజాదవ్‌ను పరిపాలనాభవనంలో అభినందించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ టి. మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ కె. మమత, బయోటెక్నాలజీ విభాగం అధ్యాపకులు టి.శాస్త్రి, శ్రీనివాస్, కేయూ అభివృద్ధి అధికారి వాసుదేవరెడ్డి, ఆర్ట్స్‌కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో ఆర్టీసీ డ్రైవర్ల విధులు

- ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం విజయభాను



ఉత్తమ ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డులు అందజేస్తున్న ఆర్ఎం, అధికారులు

హన్మకొండ: ప్రయాణికులను క్షేమంగా, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తూ ఆర్టీసీ డ్రైవర్లు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తున్నారని వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను కొనియాడారు. మంగళవారం హనుమకొండలోని వరంగల్-1 డిపోలో జరిగిన కార్యక్రమంలో రీజియన్‌లో 2024 అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో వృత్తిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం విజయ భాను ముఖ్య అతిథిగా పాల్గొని రీజియన్‌లోని 9 డిపోలలో ఎంపిక చేసిన ఉత్తమ ఉద్యోగులకు జ్ఞాపిక, ప్రశంస పత్రం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ రద్దీలోనూ ఆర్టీసీ ఉద్యోగులు సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. ఉత్తమ ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకుని మిగతా వారు పోటీ పడాలన్నారు. ఇదే ఉత్సాహంతో ముందుకెళ్లాలని సూచించారు. మరింత ఆదాయం తీసుకురావాలన్నారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు కేశరాజు భాను కిరణ్, మహేశ్, డిపో మేనేజర్లు, సూపర్ వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇండోర్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రణాళికలు

- డ్రోన్ ద్వారా పోల్ సర్వే చేయాలి
- టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ : పట్టణ ప్రాంతాల్లో సబ్ స్టేషన్ల ఏర్పాటుకు సరిపడా స్థలాలు లేవని, ఇండోర్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. హనుమకొండ, వరంగల్, కరీంనగర్‌లో ఇండోర్ సబ్ స్టేషన్ల నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరముందని ఆయన తెలిపారు. మంగళవారం నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో హనుమకొండ సర్కిల్(జిల్లా) అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్, సెక్షన్ల వారీగా ప్రగతిని సమీక్షించారు. దేవునూరు, క్యాతంపల్లి తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న 11 కేవీ లైన్ల వివరాలు అడిగి తెలుసుకుని, పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం సీఎండీ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ ప్రతీ పనిలో సాంకేతికను వినియోగించాలని సూచించారు. డ్రోన్ ద్వారా పోల్ టు పోల్ సర్వే చేయించి గుర్తించిన సమస్యను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. భవిష్యత్‌లో ఎక్కడైనా విద్యుత్ లైన్ వేసేందుకు అనుకూలం లేని ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ కేబుల్ వేస్తామని వెల్లడించారు. ప్రకృతి వైపరీత్యాలతో అంతరాయాలు ఏర్పడినప్పుడు ఒక సబ్ స్టేషన్ నుంచి మరో సబ్ స్టేషన్‌కు విధిగా ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలని వివరించారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్లు కాకుండా విధిగా టాంగ్ టెస్టర్ రీడింగ్ తీసుకోవాలని, 60శాతం కంటే లోడ్ పెరిగే అవకాశం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచాలన్నారు. జీరో విద్యుత్ ప్రమాదాలే లక్ష్యంగా డీఈలను (టెక్నికల్) సేఫ్టీ అధికారులుగా నియమించామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్‌లాల్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సీఈలు రాజు చౌహాన్, తిరుమల్ రావు, హనుమకొండ ఎస్ఈ పి.మధుసూదన్ రావు, ఎస్ఈలు, డీఈలు,ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యం

విద్యుత్ ఉద్యోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో హనుమకొండ జిల్లాలోని ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఉద్యోగులు, ఆర్టిజన్ సిబ్బందితో నేరుగా ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఉద్యోగుల భద్రతకు పెద్దపీట వేసి సర్కిల్ కార్యాలయం టెక్నికల్ డీఈలను సేఫ్టీ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. అదే విధంగా రూ.కోటి బీమా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.